జీవిత సత్యాలు

బస్సు దిగేసరికి, సామాను అందుకునేందుకు పనిమ్రవాడితోబాటు, ఇంకో యువకుడుకూడా వుండటం గమనించింది సుమిత్ర. గుడిసెబండిలో దిళ్లు అమర్చుకుని, పొలులోకూర్చుని బండితోలుతున్న ఆయువకుణ్ణి చూసింది. పాలేరు బండివెనక నడుస్తున్నాడు—సుమిత్ర అడిగేవాటికి సమాధానాలిస్తూ. 'నల్లగావున్నా కళగల మొహం' అనుకుంది సుమిత్ర. మధ్యమధ్య ఆ యువకుడి వేపు సుమిత్ర చూడటం గమనించి, పాలేరు

ఎమ్. జానకీరాణి

వాడు, "మన నాగభూషణం అమ్మాయిగోరూ" అన్నాడు, ఆ ఒక్క పేరు సుమిత్ర కంతో తెలియచేస్తుం దన్నట్లుగా. సుమిత్ర కేమీ అంతుచిక్కకపోయినా తలూపింది.

ఇంటికి చేరగానే తండ్రిని, తల్లినిచూసిన సంతోషం — మళ్ళీ స్వస్థలానికిచేరిన ఆ సంతృప్తి—వీటితో రెండురోజులబాటు నాగభూషణంసంగతే గుర్తులేదు సుమిత్రకి. ఆనర్సుపరీక్ష వ్రాసివచ్చినతర్వాత సుమిత్రకి ఒక హుందాతనం అలవడింది.

ఇంటికి చేరగానే మర్నాడే 'అప్పిన్నీ, పాఠం చెప్పవూ?" అంటూ తయారైంది కొంచెం దూరపు బంధువు కూతురు — 12 ఏళ్ల సీత. ప్రతిసెలవుల్లోనూ, సుమిత్ర పల్లెకి వెళ్లడం — తనున్న నాలుగురోజులూ బంధువులపిల్లల్లో చదువుకోవలసిన యీడువాళ్ళందరికీ పాఠాలుచెప్పడం మామూలు. సుమిత్ర వచ్చేసిన మూడోనాడు పిల్లలు అన్నీ మర్చిపోతారు. మళ్లీ సెలవులకి ప్రారంభం! అవే పుస్తకాలు, అవే గుణింతాలు.

కానీ యీమాటు క్రొత్తఅట్టతోవున్న ఈ ఇంగ్లీషు ప్రైమరీ పుస్తకాన్ని కుతూహలంతో చూసింది సుమిత్ర. పేజీ తిప్పగానే కుదురైన అక్షరాలతో, ఇంగ్లీషులో

సీతపేరు, ఆపల్లెపేరు వున్నది — ఒకటి, రెండు స్పెల్లింగు తప్పులతో.

"ఎవరు రాశారే సీతా యిది?"అన్నది—ఇక్కడ యింగ్లీషు వ్రాసేది ఎవరా అనుకుని.

"నాగభూషణం మెట్రిక్యులేషను తప్పాడుగా. ఇంగ్లీషు మాట్లాడుతాడు కూడాను." అన్నది సీత. మెట్రిక్యులేషను అంటే పెద్ద చదువుక్రిందే లెఖ్ఖ మరి.

"మనింట్లో ఎందుకున్నాడు?" అన్నది సుమిత్ర 'కాట్, రాట్' కళ్లతో చదువుతూ.

"వాళ్ళ నాన్న యిక్కడుంచి వెళ్ళాడు. పొలం పనులు నేర్చుకుంటూ, మళ్లీ పరీక్షకి చదువుతాడుట. అసలు వాళ్ళు యిక్కడే యిల్లుకూడా కట్టుకుంటారట" అని చెప్పింది సీత. సీతకి అన్ని వ్యవహారాలు తెలుసు. ఎవరి కెంతపొలం కవులుకిచ్చింది, వాళ్ళ వ్యవసాయం ఏస్థితిలో వున్నది అన్నీ తెలుసు ఆపిల్లకి. ముదిమాటలు మాట్లాడుతుంది.

సుమిత్ర పలకమీద రాసియిచ్చిన యింగ్లీషుమాటలు దిద్దుకుంటూనే, నాగభూషణం పుట్టుపూర్వోత్తరాలు, వాళ్ళ కుటుంబ వ్యవహారాలు అంతా చెప్పింది. మెట్రిక్యులేషనుపైన చదువు చెప్పించే స్తోమత లేదు నాగభూషణం తండ్రికి. పూర్తిగా వ్యవసాయంమీద బ్రతికే ఎత్తూ లేదు. "'మనం' వున్నవాళ్ళం కాబట్టి—ఏదో పొట్టకి లోపంవుండదని యిక్కడుంచి వెళ్ళాడు."—ఇవీ సీత వాక్యాలు. "మన వాళ్ళబ్బాయే." ఇదీ అతని అర్హత. నాగభూషణంస్థితిఅర్థమైందిసుమిత్రకి. డి. హెచ్. లారెన్సు వ్రాసిన ఆ నవలకి తటుకోలేక అవస్థపడుతూవున్న సుమిత్రకి, నాగభూషణాన్ని గురించిన ఆలోచన కొంత తెరపియిచ్చింది.

* * *

ప్రొద్దున్న పదకొండింటికి తండ్రికి కాలేజీ విశేషాలు చెబుతోంది సుమిత్ర. నాగభూషణం అప్పుడే వచ్చినట్లుగా వున్నాడు తెల్లవారు ఝామునగా పొలానికివెళ్ళి. "ఏం నాగభూషణం! ఎందాకా వచ్చింది పని?"అని పలుకరించారు సుమిత్ర తండ్రి పరంధామయ్యగారు.

"తొమ్మిదిబళ్లు- తోలామండీ." అని తల వంచుకుని అరుగుమీద కూర్చున్నాడు నాగభూషణం.

"చిట్టితల్లీ, ఓవల్టిన్ త్రాగలేదేం యివాళ?" అంటూ సుమిత్రతల్లి వెండిగాసు పట్టుకొచ్చింది. గ్లాసు అందుకుని నోట్లో పెట్టుకోబోతూ నాగభూషణం వంకచూసి చటుక్కున ఆగింది సుమిత్ర.

పరంధామయ్యగారు యిది చూశారు. ఆయన పకపకనవ్వి, "ఏంతల్లీ?నాగభూషణం లాంటివాడికి యిలాటివి డజనైనా చాలవమ్మా. కష్టపడి పనిచేసేవాళ్లకు చద్దన్నం మేలుచేసినట్లుగా మరేదీ చేయదమ్మా." అన్నారు.

నాగభూషణం తలెత్తి సుమిత్రవంక చూసి వెంటనే దించుకుని, సిగ్గుపడుతూ నవ్వాడు. అతని నుదుటి నిండా చెమట; కణతలు ఎర్రగా వున్నాయి.

"రారా అబ్బాయి, వడ్డించాను,"అంటూ కేకపెట్టింది సుమిత్ర నాయనమ్మ. సుమిత్ర, సీతకూడా మొగవాళ్ళతోనే భోజనాలకు కూర్చున్నారు. ఒకళ్ళిద్దరు బంధువులు, నాగభూషణం వున్నారు అదేపంక్తిలో. సుమిత్ర బామ్మ ఆదరణకు పెట్టింది పేరు.

ఇంకొస్త నేయివేయనా? వేసుకోరా పిచ్చి నాయనా, పాటుపడేవాడివి" అంటూ లాలనగా ప్రేమగా ఆ ఆశ్రితుడికి ఆవిడ భోజనం పెట్టడం చూస్తే, సుమిత్రలో ఏదో ఆర్ద్రత కలిగింది.

భోజనంచేసిన గంటకల్లా పనికి వెళ్ళిపోయాడు నాగభూషణం. వరండాలో పడక్కుర్చీలో కూర్చుని జీడిపప్పులు తింటున్న సుమిత్రకి దూరంగా పొలంలో కనిపిస్తున్నాడు అతను. గోగునార కాబోలు తీస్తున్నారు. ఎప్పుడో తను ఆ ప్రాంతాలకు వెళ్ళి, ఆవాసనకి డోకొచ్చి వెనక్కి వచ్చేసినట్లు జ్ఞాపకం సుమిత్రకి. కానీ అతను పని చేస్తున్నాడు. పాపం! అనుకుంది. తను ఆ వయస్సుకి హాయిగా ఇంటరు చదువుతూ అల్లారుముద్దుగా పెరుగుతోంది. నా అనే వాళ్లు దగ్గర లేకపోయినా, వళ్లువంచి, బాధ్యత స్వీకరించి పనిచేస్తున్నాడు పాపం! సుమిత్ర తల్లి, తండ్రి ప్రత్యేకం పట్టించుకోరు అతన్ని గురించి. పొట్టే తిండికి చేసే చాకిరీకి సరిపోతుందా అని లెఖ్ఖకట్టే వాళ్లు కూడా వున్నారు తన దగ్గరబంధువుల్లో.

"దుక్కలా వున్నాడు, అర్థశేరు తింటాడు" అని సీత తన స్నేహితులతో అంటుంటే విన్నది సుమిత్ర. ఒక్కబామ్మ తప్ప మరెవరూ ప్రత్యేకం ఆదరించి, 'అయ్యో నాయనా' అనరు. ఎవరితోనైనా ఆవిడ అల్లాగే ఆప్యాయంగా మాట్లాడుతుంది.

"పాపం! ఈవయస్సులోనే యిల్లా..." నిద్ర ముంచుకొచ్చి ఆవలించింది సుమిత్ర.

* * *

మూడు నాలుగు రోజులకి కొంచెం నోరెత్తి మాట్లాడ్డం మొదలుపెట్టాడు నాగభూషణం సుమిత్రతో. 'ఏమండీ మంచినీళ్లిస్తారూ' అనో, 'కలం యిస్తారూ' అనో పలుకరించేవాడు. అతను వ్రాస్తుంటే దీక్షగా చూస్తుండేది సుమిత్ర. కరుణ నిండి వుండేది ఆమె చూపుల్లో. ఒకటి రెండు సార్లు నాగభూషణం ఆచూపుని చూశాడు. మొదట్లో సిగ్గుపడుతూ, ఆతర్వాత తమాషాగా నవ్వడం ప్రారంభించాడు.

సుమిత్ర తనవంక చూస్తున్న సంగతి ఎరుగున్నట్లుగా వుండేది అతని ప్రవర్తన. తమాషాగా తల ఎగరేయడం, జుట్టు వెనక్కి త్రోసుకోవడం, గుండీలు సరిచేసుకోవడం_ మామూలే! సుమిత్ర పక్కకి తిరిగి నవ్వుకునేది. కుర్రాడు_ చేష్టలు ఎక్కడికి పోతాయి! అనుకునేది.

వేసవికాలం_దొడ్లో మల్లెఅంటు ఆవిడు పూర్తిగా ఎండిపోయింది. సుమిత్రకి సాయంత్రంకాగానే మల్లెల వాసనమీదకి మనస్సుపోయేది. తెల్లని మల్లెమొగ్గలు కావాలని కోరిక—రెండుమైళ్ళదూరం పోవాలి వాటికోసం. బిడ్డకోరికలు చెల్లిస్తారు ఆమె తల్లిదండ్రులు. అడిగిందే తడవు అన్నీ వస్తాయి.

మల్లెలు, ఆ సౌరభం, ఆ చల్లదనం తనకు కావాలని—సాయంకాలాల్లో ఆ వాసనని చూస్తూ, ఏదో తీయని వేదనను కలిగించుకోవాలని—అదో ఆరాటం. ఇవన్నీ చెప్పకోదు సుమిత్ర. ఏవైనా సరుకులు కావాలని పక్కగ్రామాలకి పాలేరు పోతుంటే రెండుమాట్లు పూలసంగతి చెప్పింది. పెసలు, కందులు శేర్లతోసహా జ్ఞాపకమున్నట్లుగా

రవి టాయిలెట్స్ అందముకు, వర్చస్సుకు

రవి గ్లిసరిన్ సోప్:—అన్ని కాలముల్లో, ముఖ్యంగా వేసవికాలములో వాడదగినది. శరీరమునుమృదువుగను, కాంతిగనుఉంచును.

రవి వెజిటబుల్ హేరాయిల్:_ శిరోజములను విస్తారంగా పెంపొందించును. దానిచక్కని సున్నితమైన సువాసన అందరికి ఆనందము కలుగచేయును.

రవి స్నో:_ముఖవర్చస్సును కాపాడి, విలాసమును పెంపొందించును. సోల్ఏజెంట్లు:_

ది న్యూస్టార్ & కంపెని, 10, వైద్యనాథ మొదలివీధి, తండియార్పేట, మద్రాసు-21.



★ జీవిత సత్యాలు ★

వీటిసంగతి జ్ఞాపకంవుండదు వాళ్లకి.

నాగభూషణం వెడుతున్నాడు ఒకసారి వెచ్చాలకోసం. వెడుతూ వెడుతూ వరండా లోకి తొంగిచూసి నవ్వాడు. "మల్లెపూలు తీసుకువస్తావా నాగభూషణం ?" అనుకో కుండానే అడిగింది సుమిత్ర. చిన్నవాడు కాబట్టి 'నువ్వు' అనవచ్చునని వాళ్ళనాయ నమ్మ చెప్పింది. తలవూపి వెళ్లాడు నాగ భూషణం—

సాయంకాలం వీచే పిల్లగాలులు పెను గాలులై, చిన్న చినుకులు పెద్దవై కుంభ వర్షం—ప్రొద్దుపోయేవరకు కురిసింది.

దోవ అంతా బాగుండదు. తాటితోపులు, దట్టంగా చెట్లు మామూలుగానే చిమ్మచీక టిగా వుంటుంది. ఈ వానలో ఆ దోవ చాలా ప్రమాదకరం. నాగభూషణం రాలే దని ఆరాటపడ్డారు యింట్లోవాళ్లు. పాపం నాగభూషణం తడిసిపోతాడేమో, యీ చీకట్లో, వర్షంలో ఏమైపోతాడో—తెల్ల వారి వచ్చినా బాగుండుననుకుంది సుమిత్ర.

అందరూ భోజనాలు చేసేశారు—ఇంక నాగభూషణం రాడని నిశ్చయించుకుని. 11 గంటలకి వచ్చాడు నాగభూషణం. బట లన్నీ తడిముదలు. పాలేరు కూరలసంచీ పట్టుకుని వణుకుతున్నాడు. వెచ్చాలుమాత్రం కొట్లోనే వుంచివచ్చారుట. సుమిత్రకి వళ్ళు జలదరించింది యీ చిమ్మచీకట్లో ఎల్లా వచ్చారు వీళ్లని.

కూరలన్నీ క్రింద గుమ్మరించి, వాటి లోంచి ఏరి, ఒక పెద్దపొట్లం అందించాడు సుమిత్రచేతికి నాగభూషణం. చల్లగా, యీగాల్లాగావున్న అతని వ్రేళ్ళు తగిలాయి ఆమెకి. ఒక్క జలదరింపు! మల్లెపూలు! గుప్పున వాసనవేసింది. తెల్లగా, చల్లగా వున్న పూలు!

"మల్లెపూలు తెచ్చావా?" మృదువుగా వుంది సుమిత్ర కంఠం. నాగభూషణం నవ్వాడు. ఆ చూపు, నవ్వు, అతని స్పర్శ-ఏమిటో—తెల్లని ఆ మల్లెలు సుమిత్ర మన స్సుకి దాపుగాపోయి, ఆమె అనుకున్న కల తలు కలిగించనేలేదు ఆ రాత్రి. ఏదో చిన్న జీర, అపశ్రుతి!

* * *

సుమిత్ర రిజల్టు వచ్చాయి. ఫస్ట్ క్లాసులో ప్యాసైంది. ఇంక పై దేశాలకు పోవడమూ, ఉద్యోగం చేయడమూ—అన్ని సమస్యలు చర్చిస్తున్నారు తల్లిదండ్రులు. ఇంట్లో విశ్రాంతిగా నేవున్నా సుమిత్రకి మాత్రం ఏదో గందరగోళంగా వున్నది వాతావరణం.

నాగభూషణం చద్దన్నం తిన్నా, ప్రొద్దె క్కిన తర్వాత యింటికొచ్చి సుమిత్ర పిన్నితోపాటు • కాఫీ త్రాగుతున్నాడని, పొలానికికూడా ఇస్త్రీ చొక్కా వేసుకు వెడుతున్నాడని—సీత గడగడ చెప్పేస్తోంది మిత్రురాలితో. సుమిత్రకి అన్నీ వినబడు తున్నాయి. కుర్రాళ్ళకి ఏదో చిన్న సర దాలు వుంటాయి. తను చూస్తుండగా, ఏదో చేయాలని ఆరాటపడుతున్నాడు ఆ కుర్రాడు. అందులో సందేహంలేదు. తనని ఆకర్షించాలని—

గులాబిరేకుల్లాంటి ఎర్రని పెదవులు మెల్లిగా విచ్చుకుని, ఆ మల్లె మొగ్గలు కొంచెం కనబడేలా నవ్వుతుంది సుమిత్ర. ఇల్లాంటి వుపమానాలన్నీ అద్దం ముందు నిల్చున్నప్పుడు జ్ఞాపకం రాకతప్పవు సుమి త్రకి—ఆమె పెదవులు, పలువరస— అల్లాంటివే మరి. నిగనిగలాడే తన చేతులని, లేసులాబిలాగా, కొంచెం కందినట్లుగా మెరిసిపోయే తన వేళ్ళకొసలని చూసుకుని అనుకుంటుంది సుమిత్ర—మా వాళ్ళు సుకు మారంగా పెంచారు నన్ను అని.

కుర్రాళ్లకి ఒకానొక వయస్సులో అంద మైన ఆడపిల్లలంటే ఒక వింత ఆకర్షణ వుంటుందని సుమిత్ర అనుకునేది. అది ఒక కుతూహలం! కేవలం పసితనం అనుకునేది సుమిత్ర. నాగభూషణం వయస్సు పద్దెనిమి దేళ్ళు మించదు. ఇతన్ని చూశాక తన అభి ప్రాయాన్ని బలపఱచుకున్నది ఆమె.

కానీ—ఎందుకో అసందర్భంగానే వున్నది అతని ప్రవర్తన.

ఏదో పిండివంటచేయడం మొదలు పెట్టింది సుమిత్ర ఒక మధ్యాహ్నం. జీడి పప్పులు, నెయ్యి అన్నీ విరివిగా ఖర్చుచేసి, తినుబండారం తయారుచేసింది. అందరూ తిన్నారు—బాగున్న దన్నారు. సుమి త్రకి తినాలనిపించలేదు. ఆ పెగ మంచిలేచి, ముఖం కడుక్కుని వెళ్ళి పడు కుంది. వెనకాల సర్దుబాట్లన్నీ తల్లి చేసుకుంది. అలిసిపోయిందేమో మంచి నిద్రపట్టింది సుమిత్రకి. సాయంకాలం చల్లబడిన తర్వాత లేచింది. స్నానం చేసివచ్చి, తల దువ్వు కుంటుంటే నాగభూషణం వచ్చాడు.

చటుక్కున జ్ఞాపకం వచ్చి, "అమ్మా, నాగభూషణానికి మిఠాయి పెట్టవే" అన్నది సుమిత్ర.

"నువ్వు కూడా తింటావా?" అన్నది సుమిత్ర తల్లి లోపల్నుంచే.

"ఆఁ" అని జడ అల్లుకోవడం మొదలు పెట్టింది.

"మీరు చేసి, మీరే తినకపోవడ మేమిటి?" అన్నాడు నాగభూషణం.

సుమిత్ర చిలిపిగా నవ్వింది. "నీకోసమే

ఆగాను"-తనల్లా అనడం సమంజసం కాదని వెంటనే తోచింది. అతనిముఖం ఎర్రబడడం, తన ముంగురులని, చెంపలని అతను మరీ పరీక్షగా చూడడం అన్నీ గమనించింది సుమిత్ర ఏదో పనున్నట్టు అవతలి గదిలోకి వెళ్ళింది ఆమె. నాగభూషణం మిఠాయిని పొగడటం విన్నది సుమిత్ర.

చీకటి పడే వేళ మళ్ళీ మల్లెపూలు వచ్చాయి సుమిత్రకోసం. ఆమె మనస్సు బాగుండలేదు. ఏమిటిదంతా? ఏమైనా వెర్రివాడా అతనికి అనుకున్నది సుమిత్ర.

తన వయస్సు ఇరవైరెండు. అతని వయస్సు మహా ఐతే పద్దెనిమిది! అతనికి పాఠాలు చెప్పగలిగేంత చదువు చదువుకున్నది తను! అతను పెద్ద అందమైనవాడు కాదు; తను అతని పోషకుల బిడ్డ. ఎందుకిల్లా ప్రవర్తిస్తున్నాడు-యితను? కొంచెం అహంకారం అతని స్వభావంలో-ఎందుకనో?

తెలియనితనం కాదని సుమిత్ర గ్రహించుకుంది. ప్రయత్నపూర్వకంగా నాగభూషణం అలా ప్రవర్తిస్తున్నాడు. ఏమి ఆశించి యిల్లా చేస్తున్నాడు? పూర్తిగా అతన్ని నిర్లక్ష్యం చేసే శక్తలేదు సుమిత్రకి. తెరలాగా అతని ఛాయ వస్తోంది ఆలోచనల్లోకి.

బాగా చీకటి వుండగానే లేచి, స్నానం చేసింది సుమిత్ర. ఆకుపచ్చ చీరె కట్టుకుని, జుట్టు ఆరబెట్టుకుంటూ కోరడి దాటి వెళ్ళింది. పద్యాలు చదువుకుంటూ వెళ్ళి చెరువుగట్టున బండమీద కూర్చున్నది. ప్రకృతి అంతా నిశ్శబ్దంగా వున్నది.

చెరువులో చప్పుడై ఉలిక్కిపడింది సుమిత్ర. నాగభూషణం కావడి వేసుకొని వచ్చాడు. బిందె ముంచుతూ తనవంకే చూస్తున్నాడు. అతని చూపులోనే వున్నది ఏదో అహంభావం-సుమిత్రకి మనస్సు బాగుండలేదు. ఏదో విరూపంగా అనిపించి వేరే వేపు చూపు మరల్చింది ఆమె.

కావిడి క్రింద పడేసిన చప్పుడైంది. అడుగుల చప్పుడు తన దాపుకు వచ్చి, తన వెనక ఆగినట్లు విన్నది సుమిత్ర.

చటుక్కున వెనక్కి తిరిగి, "ఏం కావాలి?" అన్నది.

"ఏమీ అక్కర్లేదు." అతను ఖంగారుపడలేదు ఆమె ప్రశ్నకు. ముందుకి వచ్చి, బండె ప్రక్కనే గడ్డిమీద కూర్చున్నాడు.

"చాలా అందమైన వారు మీరు." సుమిత్ర చటుక్కున కాళ్లు అవతలికి తీసుకుంది. ఓహో! అనుకుని మనస్సులో, లేని పొందాతనం తెచ్చుకుంది.

"ఐతే ఏవిటి?" అన్నది-

"మీరంటే యిష్టం నాకు." తెల్లగా మొగలిరేకులాగా వున్న సుమిత్రపాదం కొంచెం కదిలింది. చటుక్కున వంగి, చేతులతో ఆ పాదం పట్టుకుని ముద్దుపెట్టుకున్నాడు నాగభూషణం.

"ఛీ!" లేచి నిల్చున్నది. అతని మాటలు వినలేదు, అతని వంక చూడలేదు. అర్థం కాని చీకాకుతో, అసహ్యంతో విసవిస నడిచి యింట్లోకి వెళ్ళిపోయింది సుమిత్ర.

తన పాదంమీద అతని మొద్దుబారిన చేతుల స్పర్శ రోజంతా తెలుస్తూనే వున్నది. ఎన్నిసార్లో కడుక్కుంది సుమిత్ర ఆ కాలుని.

నాగభూషణం ప్రవర్తనతో ఎక్కువ రోజులు చీకాకు పడనక్కర్లేకుండా సుమిత్ర ఆ మరునాడే పట్నం వెళ్ళిపోయింది. నాగభూషణం ఆమె స్మృతిపథంలోంచి మెల్లిగా తొలగిపోయాడు.

* * *

ఆనర్సు ప్యాసైన సుమిత్ర ఉద్యోగమూ చేయలేదు, విదేశ యాత్రకూ వెళ్ళలేదు. ఒక భావుకుని ఆదర్శగృహిణిగా స్థిరపడింది.

ఒకరాత్రి, నీలందీపం కాంతిలో సోఫాలో కూర్చుని చదువుకుంటోంది సుమిత్ర. కాళ్లు పైకి ముడిచిపెట్టుకుని, వెచ్చగా కూర్చుంది. ఆమెభర్త ఆ సోఫాలోనే రెండో మూలకి కూర్చుని ఏదో వ్రాసుకుంటున్నాడు.

"ఏం సుమిత్రా! చలి వేస్తోందా?" అంటూ నవ్వాడతను ఆమె కూర్చున్న తీరు చూసి.

"ఊఁ. కాళ్ళుకూడా చల్లబడుతుంటే."

"ఏదీ చూడనీ" అంటూ పక్కకి వంగి, ఆమె తెల్లటిపాదాల్ని చేతితో స్పృశించి, ఆమె అరికాల్లోనే చటుక్కున ముద్దుపెట్టుకున్నాడు.

సుమిత్ర వారించింది. రెండు సంవత్సరాలనాటి స్మృతులు, సంఘటనలు మనసులో గిరుక్కున తిరిగాయి. అనుకోకుండానే అన్నీ చెప్పింది భర్తకి ఆమె. అల్లాగ అన్నివిషయాలు ఆమెచేత చెప్పించే నేర్పు వున్నది అతనికి మరి.

ఒకొక్కసంఘటనే మెల్లిగా జ్ఞాపకం చేసుకుంటూ చెప్పింది సుమిత్ర: "నేను చూపించిన దయని అపార్థం చేసుకున్నాడు అతను. కాకపోయినా నా వయస్సుతో కూడా నిమిత్తం లేకపోయింది అతనికి. అతను అందగాడు కాదు, చదువుకున్నవాడు కాదు. అతనికి అన్నివిధాలా అధికురాలిని నేను. ఏమిటో మరి ఆ పిచ్చితనం? వయస్సు, విద్య రూపం, అర్హత ఏమీ అడ్డంరాలేదు అతనికి. తన అంతస్థు సంగతైనా చూసుకున్నాడు కాదు" సాలోచనగా కిటికీవంక చూస్తూ కూర్చున్నది సుమిత్ర.

"అలా ఎల్లాగ ప్రవర్తించగలిగాడండీ అతను? ఏమి ఆశించి, అనుకుని అల్లా చేశాడు?" అన్నది భర్త వేపు చూస్తూ సుమిత్ర.

అతను నవ్వి లేచి నుంచున్నాడు. ఆమె ఎదురుగా వచ్చి, జుట్టుమీద చిటికె వేశాడు.

"ఏమీ అనుకోనక్కరలేదు, ఆశించనక్కర్లేదు. పిచ్చిపిల్లా, అతను మొగవాడు, నువ్వు ఆడదానివి-మిగిలిన విషయాలు నిమిత్తమాత్రాలు!"

అది ఎల్లాగ సాధ్యమౌతుందా అని రాత్రంతా ఆశ్చర్యపోయింది సుమిత్ర. కానీ అదికూడా ప్రపంచంలోని మూలసత్యాలలో ఒకటేమోననుకుని, అర్థంలేని నవ్వు నవ్వి, పడుకుని నిద్రపోయింది. ★

పూర్తి విూ అదృష్టం చెప్పగలడు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టుకార్డుపైన నీకు యిష్టమగు ఒక పుష్పము పేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డు వ్రాసిన తేదిలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారిగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జిలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవయినా వున్నయెడల శాంతిచేయు విధానంకూడా తెలుపగలము. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించి చూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.